ఆస్తంతా అమ్మి
కొడుకును
ప్రయోజకుడ్ని
చివరికి
మిగిలిందేమిటి?

# ఎమ్మెన్నార్జ్ కథ

# ఏ తల్లీ కనకూడదు

రాజమ్మకు బస్సులోంచి కిందికి దిగాక, ముందుకు నడవడానికి కాళ్ళాడలేదు. అంటే బస్సులో కూర్చుని కూర్చునికాళ్ళు పట్టుకుపోయాయని కాదు. ఆ మాటకువస్తే రాజమ్మకు బస్సు ఎక్కేటప్పుడు కూడా కాళ్ళు ఆడలేదు. అంటే ఆమెకు కీళ్ళజబ్బుందని కాదు. ఇంకా చెప్పాలంటే బస్సెక్కడానికి ఇంట్లోంచి బయలుదేరేప్పుడు కూడా రాజమ్మకు కాళ్ళాడలేదు. అంటే ఆమె కాళ్ళకు అవిటితనం వుందనీ కాదు.

పండగ సీజను కావడంవల్ల బస్టాండు అంతా కోలాహలంగా వుంది. ప్రయాణీకులందరి మొహాల్లోనూ సంతోషం వెల్లివిరుస్తుంది. ఒక్క రాజమ్మ మొహంలో మినహా.

అరైవింగ్ బస్సుల్లోంచి దిగే ప్రయాణికులు ఉత్సాహంగానే వున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్ళేందుకు బస్సుల్లోకి చొరబడుతున్న ప్రయాణీకులు మహదానందంగా వున్నారు. రావాల్సిన బస్సుల కోసం పడిగాపులుపడుతున్న ప్రయాణీకులు కూడా ఉల్లాసంగానే వున్నారు.

రాజమ్మ దిక్కుతోచకుండగా— బస్టాండు గేటు పక్కన కూర్చుండిపోయింది. ఆమె చేతిలో సత్తుగిన్నెలేదు కానీ, చూపరులకు బిచ్చగత్తెలాగానే అగుపిస్తోంది. నిలువు దోపిడీ కాబడ్డ వృద్ధ బిచ్చగత్తెలా వుందామె. రవిక కుడిబుజం మీద చిరిగివుంది. ఎడమ బుజం మీద మ్యాచ్ కాని మాసిక వుంది. ఎదమీద చాలీచాలని కొంగు, అంచుసైతం చిరిగి చీలికలైపోగులు వేలాడుతున్న ముతకచీర, అంతకంటే ముతకైన దేహం, వృద్ధాప్యం పైనబడ్డంవల్ల మొహం ముడతలుపడివుంది.



తలకు చమురులేదని వేరే చెప్పక్కర్లేదనుకుంటాను. కాకపోతే తలమీద, సగానికి పైగా తెల్లవెంట్రుకలున్నాయి. సిగలా చుట్టడానికి, జడలా అల్లుకోడానికి ఏమాత్రం వీల్లేకుండా వున్నాయి.

రాజమ్మ మనసు దిగులుతో నిండివుంది ఆమె కడుపు రెండురోజుల ఆకలితో ఎండివుంది. కుడికన్ను అంతంత మాత్రం

అగుపిస్తుంది. ఎడమకన్ను తన శక్తిని కోల్పోయి రెండు సంవత్సరాలకు పైగానే అయ్యింది. ఆమె తలలో మెదడు వుందికాని, ప్రస్తుతం అది కూడా సందిగ్ధంలో పడివుంది

"ప్చ్! ఈ వూరికి రాకున్నా బాగుండేది' తనలోతనే గొణుక్కుంది రాజమ్మ. నాలుగు రోజుల్నుంచీ పోకూడదు పోకూడదు అనుకుంటూనే ఈ ఊరికి వచ్చింది రాజమ్మ.

"ప్చ్! ఊరికాడ ముసలోడు ఎట్లుండాడో! దిక్కులేని బతుకైపోయె" తన భర్తను తలచుకుంది రాజమ్మ. అలా తలచుకున్నది తడవుగా కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి. కుడికన్ను సగం పనిచేస్తున్నా, ఎడమ కన్ను ఏమాత్రం పనిచేయకపోయినా కన్నీళ్ళకు మాత్రం కొదవలేదు.

రాజమ్మకు తాను వచ్చిన పనికి పూనుకోవడానికి మనస్కరించలేదు. ఇటునుంచి ఇటే బస్సులో తిరిగి వెళ్లామంటే బస్సుకి రాయికి డబ్బులులేవు. ఆమె గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. ఆమె మనసులోని దిగులుకు బుగులు నేస్తం అయ్యింది.

ఎలాగూ వచ్చాను, వచ్చాను. వాడిని కలిసే తిరిగివెళతాను. ఎలాగూ తిరిగి వెళ్ళడానికి బస్సుఛార్జీలకు డబ్బుల్లేవు... బస్సు ఛార్జీలకు అడగడానికైనా వెళ్ళాలి అనుకుని లేచి నిలబడింది రాజమ్మ. ముందుకు నడవడానికి కాళ్ళాడక అలాగే నిలుచుండిపోయింది.

ఇంతదూరం వచ్చి వాడిని కలవకుండా ఎలా వెళ్ళాలి? వాడితో తాను వచ్చిన పనికాదని తెలిసి కూడా ఏదో ఆశ చిగురించడంవల్ల వెళ్ళాలనుకుని ఇంతదూరం వచ్చింది. తన ఆశ ఫలించకపోతుందా! ఆ ఆశతోనే రెండడుగులు ముందుకువేసింది రాజమ్మ. ఒళ్ళు సొలినట్లయ్యింది. కిందపడబోయి తమాయించుకుని నిలబడిపోయింది.

బస్సు ఛార్జీలకైనా డబ్బులిస్తాడోలేదో వాడు అన్న అనుమానం వచ్చింది. ఇవ్వకపోతే ఇవ్వకపోయాడు... ఏదో ఒకటి తేలిపోతుంది. కనీసం వాడిని ఒంటికన్నుతో చూసే భాగ్యమైన కలిగితే చాలనుకుని వడివడిగా నడవడం మొదలుపెట్టింది.

ఈరోజు ఆదివారం... ఆఫీసుకు సెలవు ... ఇంటిదగ్గర తప్పక కలుస్తాడని అనుకుని బయలుదేరివచ్చింది రాజమ్మ. వాడు పనిచేసేది ఇదే వూళ్ళోనే అయినా ఉద్యోగరీత్యా ఎప్పుడూ ఎక్కువగా ఇతర ఊళ్ళల్లోనే వుంటాడు. ఇంతక్రితం రెండుమూడుసార్లు వాడిని చూడాలని వచ్చింది రాజమ్మ. కానీ ఎప్పుడూ వాడు దర్శనమివ్వలేదు. ఆదివారం పూట అవుతే కలుస్తాడని తెలుసుకుంది. కానీ కొన్ని ఆదివారాలు ఆమెకు ఈ ఊరికి రావడానికి వీలుపడలేదు. మరికొన్ని రోజుల తరువాత తప్పనిసరి రావాల్సిన పరిస్థితి ఏర్పడనందున రావడం మానుకుంది. ఇప్పుడు రాక తప్పలేదామెకు.


రాజమ్మ భర్తకు జబ్బుచేసింది. డాక్టర్లు ఎక్స్‌రే పరీక్షచేసి, హైదరాబాద్‌కు వెడితే అక్కడ డాక్టర్లు ఆపరేషన్ చేసి జబ్బును నయం చేస్తారని చెప్పారు... కనీసం నాలుగు వేలైనా ఖర్చవుతాయని చెప్పారు.

రాజమ్మ దగ్గర అంత డబ్బులేదు. డబ్బుకు సరిపడ ఇల్లుకానీ పొలంకానీ, నగలుకానీలేవు. అమ్ముకోవాలన్న తమ రెక్కలను నమ్ముకుని ఎలాగో పూరిగుడిసెలో బతుకునీడుస్తున్నారు. తమ రెక్కలను తాకట్టుపెట్టే రెండువందలు అప్పుచేసి, ఎక్స్‌రేలకు, డాక్టరుగారి ఫీజులకు, ఆయన రాసిన మందులకు పూర్తిగా ఖర్చుపెట్టారు.

కొంతకాలం క్రిందట రాజమ్మకు— తన పల్లెలో ఓ డాబా ఇల్లుండేది... వంటిమీద పదికాసుల బంగారం, ఇంటిముందు నాలుగు ఒంగోలు కోడెలు, ఆ కోడెలు రోజూ దున్నీదున్ని అలసిపోయేంతగా పొలం వుండేది. ఇప్పుడవన్నీ ఏమీలేవు... తన భర్త జులాయిలా తిరిగి వాటిని పోగొట్టుకోలేదు. కేవలం తన కన్న కొడుకు చదువు కోసం ఆ ఆస్తినంత పోగొట్టుకోవాల్సి వచ్చింది.

ఏ చదువుకోసమైతే ఆస్తినంతా పోగొట్టుకున్నదో, ఆ చదివిన కొడుకు దగ్గరకు తన భర్త ఆపరేషన్‌కు డబ్బు అడగడానికి బయలుదేరివచ్చింది రాజమ్మ. శతకోటి విధాలా తన కొడుకు చేయి విదిలించడని అంతరాత్మ చెబుతున్నప్పటికీ, కన్న తండ్రి చావు బతుకుల మధ్య వుంటే కనీసం కనికరించక పోతాడా అన్న ఆశతో బయలుదేరి వచ్చింది రాజమ్మ. గతంలో చేయికాదు కదా వేలు కూడా విదిలించని సంఘటనలు అనుభవ పూర్వకంగా చవిచూడ్డంవల్లే— ఆమెకు ఇంట్లోంచి బయలుదేరేప్పుడు బస్సు ఎక్కేటప్పుడు బస్సులోంచి దిగిన తర్వాత కొడుకు దగ్గరకు వెళ్ళేందుకు కాళ్ళాడలేదు.

రాజమ్మ ఒక పల్లెటూళ్ళో పుట్టిపెరిగి మరో పల్లెటూళ్ళోని మెట్టినింటికి కాపురానికి వచ్చింది. అటు పుట్టినింట్లోనూ, మెట్టినింట్లోనూ ఎవరికీ కూడా చదువు అబ్బలేదు. అబ్బలేదు అనేకంటే చదువుకునే సౌకర్యం లేదని చెప్పడం సబబు. చదువుకున్న వాళ్ళు సైతం, అలగా జనానికి చదువెందుకు? అని అనే రోజులు అవి. అలాంటి రోజుల్లో "రాజమ్మా! నీ కొడుకు మొహంలో రాజకీ



వి అగుపిస్తోంది. చదువు నేర్చుకుంటే గొప్ప అదృష్టజాతకుడవుతాడని అనిపిస్తోంది. చదువు నేర్పించకూడదా!'' అని ఆ ఊళ్ళోని ఓ పెద్దమనిషి అన్నాడు రాజమ్మతో

''మాలాటోళ్ళకు సదువెవరు సెబుతారు సావీ! ఎవురేనా సెబితే సరస్వద్దేవికి కోపం రాదా? వాడు సదువుకుంటే నా మొగునికి కాపుదనానికి సహాయం ఎవురుంటారు సావీ!'' అంది రాజమ్మ.

ఆ పెద్ద మనిషి రాజమ్మ అమాయకత్వానికి నవ్వుకుని ''నీకు కొడుకు పుట్టకుండా వుండి వుంటే ఎవరు సహాయపడేవాళ్ళు! నీకు ఒక కొడుకు పుట్టలేదనుకో... పిల్లవాడిని నా దగ్గరకు పంపించు. సరస్వతిదేవి కోపపడుతుందో సంతోషిస్తుందో నువ్వే చూద్దువుగాని'' అన్నాడు.

ఆ మరుసటిరోజే ఆరేళ్ళ తన కొడుకుని పెద్దమనిషి దగ్గరకు చదువునేర్చుకోవడానికి పంపించింది. అంతక్రితం ఏడాది పాడవునా చదివి కూడా చదువు సరిగా అబ్బని పిల్లలున్న ఆ ఊళ్ళో, రాజమ్మ కొడుకు రెండు సంవత్సరాల్లో నేర్చుకోవాల్సిన చదువును కేవలం ఆరుమాసాలలోపునే నేర్చుకోవడంతో— ఆ పల్లె జనమంతా (చదువుకున్నవాళ్ళు) అబ్బురపడ్డారు. 'సరస్వతి పుత్రుడు' అని చదువురాని వాళ్ళు సైతం బిరుదిచ్చారు. ఎలాగైనా పెద్ద చదువులు చదివించమని ఆ పల్లె జనమంతా రాజమ్మతో చెప్పారు. రాజమ్మ కూడా వాళ్ళ మాటలను గౌరవించింది. ఆ పల్లెలో ఎలిమెంటరీ స్కూల్ లేకపోయినప్పటికీ— పొరుగూరి బడిలో తన కొడుకును చేర్పించింది రాజమ్మ.

రోజులు గడుస్తూనే ఉన్నాయి. రాజమ్మకు మరో ఇద్దరు మగపిల్లలు పుట్టారు. వాళ్ళను కూడా వీధిబడిలో చేర్పించింది. వాళ్ళకూ చదువు బాగానే అబ్బింది. కానీ వాళ్ళను కూడా పై తరగతులకు చదివించాలంటే ఆర్థికంగా ఎంత ఇబ్బంది వుంటుందో గ్రహించింది రాజమ్మ. ముగ్గురి కొడుకులనూ అంతంత మాత్రం చదివిపించి వదలిపెట్టేకంటే పెద్దవాడికే పై చదువులు చదివిస్తే బాగుంటుందని నిర్ణయించుకునీ ఇద్దరి పిల్లలకు చదువుని అర్ధాంతరంగా ముగించి వ్యవసాయంలోకి లాక్కుంది రాజమ్మ.

రాజమ్మ పెద్ద కొడుకు స్కూల్ ఫైనల్ కు చేరుకునేసరికి రాజమ్మ కుటుంబం అప్పులపాలైంది. కొడుకు చదువు కోసమే అప్పుల పాలు కాలేదు. వరుసగా మూడు సంవత్సరాలు కరువువచ్చింది. కరువులో అధిక మాసమన్నట్టుగా అదే సమయంలో రెండు ఎద్దులు బక్కచిక్కి చనిపోయాయి. రెండో కొడుకు సంవత్సరంపాటు ఒక వ్యాధితో మంచానపడ్డాడు.అప్పుడు కొత్త ఎడ్లను కొనడానికి, కొడుకు వ్యాధిని నయం చేయడానికి రాజమ్మ ఒంటిమీది నగలన్నీ మాయమైపోయాయి.

అప్పులు మొత్తం తీరకముందే రాజమ్మ పెద్దకొడుకు, హైదారబాద్ లో పై చదువులు చదువుతానన్నాడు. ''ఇంక మావల్ల కాదురా'' అన్నారు రాజమ్మ, తన భర్త.

''అట్లా అనకండమ్మా! పాలిటెక్నిక్ అంటే మూడేమూడు సమ్వచ్చరాలు... ఆ

మూడేళ్ళు చదివితే ఇంజనీరు నౌకరీ దొరుకుతుంది... ఏడాది దిరిగే లోపల ఇలాంటి ఇండ్లను పది కట్టిస్తా'' అని అన్నాడు వాడు.

కొడుకు మాటలను అర్థం చేసుకుంది రాజమ్మ. ఇలాంటి ఇండ్లను పదింటిని కట్టిస్తా అంటే ఉన్న ఇంటిని అమ్మి అయినా సరే చదివించండి అన్నట్టు రాజమ్మ భర్త కూడా అర్థం చేసుకున్నందున'' ఉన్న ఒక్క ఇల్లు అమ్మీ ఎక్కడ వుండమంటావు? అని అడిగాడు.

''ఎక్కడ ఏమిటి? మన పొలాలు ఊరికి ఆనుకునే కదా వున్నవి! అందరిలా మనమూ ఓ గుడిసె వేసుకుందాం'' అన్నాడు. కుటుంబ సభ్యులందరి అంగీకారంతోఇంటిని అమ్మేసారు. రాజమ్మ పెద్ద కొడుకు హైదరాబాద్ లో పాలిటెక్నిక్‌లో చేరిపోయాడు. రెండవ సంవత్సరం పూర్తవడానికి ఒక ఎకరం అమ్మక తప్పలేదు రాజమ్మకు. అప్పుడు కూడా ''ఉద్యోగంలో చేరిన ఆరునెల్లలోపునే రెండెకరాల పొలం కొంటాను'' అన్నాడు. ఆ తరువాత మూడో సంవత్సరం పూర్తవడానికి కూడా మరో ఎకరం అమ్మక తప్పలేదు రాజమ్మకు.

పాలిటెక్నిక్ పూర్తయ్యాకా బి.ఇ చదువుతానన్నాడు. రాజమ్మ గుండె అదిరింది. ''సదివిన కాడికి సాల్లే కొడుకా! సర్కారు కొలువు సంపాదించుకో'' అంది రాజమ్మ.

''అట్లా అనకమ్మా! బి.ఇ అంటే ఏందో నీకు తెలువదు. అది సదువుతే నా చేతికిందనే నలుగురు సర్కారు ఉద్యోగులు పనిచేస్తారు'' రాజమ్మను ఊరించాడు వాడు.

''అంత ఆశకు పోకూడదు కొడుకా! ఈడికేసాల్లే! ఇప్పటికే దిక్కుమాలిన బాకీ తీరకుండగా వుంది. ఇంకా పెద్ద సదువంటే పైసలెక్కువ కర్చయితయి. యాడికెల్లి తెచ్చేది? ఇప్పటికే వేసిన అప్పుకు ఒడ్డీకట్టలేక సస్తుందాం...'' పరిస్థితులను అర్థం చేసుకొమ్మన్నట్టు చెప్పింది రాజమ్మ.

''పైసలు చాలా కర్చయితాయని ఎనకబడితే ఎట్లాగే అమ్మా! డబ్బులున్నోళ్ళకు కూడా సీటు దొరకదు... నాకు మార్కులెక్కువొచ్చినవి గనుక సగం పైసలు సర్కారే కర్చుపెడ్తాది. ఆ సగమైనా మీరివ్వకుంటే



## అనుభవం

జడ్జి ముద్దాయితో

''మిస్టర్! నీవు మానభంగం చేసిన అమ్మాయికి ఇది మొదటి అనుభవం కాదని ఎలా చెప్పగలవు?''

''నాకు వచ్చిన సుఖవ్యాధిని బట్టి'' గుర్రుగా చూస్తూ చెప్పాడు ముద్దాయి.

—పి.కృష్ణమూర్తి (హిందూపురం)

ఎట్లా?'' బతిమాలాడు.

''ఇంతకూ అదెన్నేండ్లా సదవాలా?''

''నాలుగేండ్లు సదివితే సరిపోతుందంతే. .. డైరెక్టుగా చేరితే అయిదేళ్ళు పడుతుంది.. నేను పాలిటెక్నిక్ సదివిన కాబట్టి నాలుగేండ్లే ''

రాజమ్మ గుండెలు కొట్టుకుంది. ఇంకా నాలుగు సంవత్సరాలు చదవాలనేసరికి. ఇంక చదువొద్దు ఏమొద్దూ అని నిశ్చయించుకున్నది. కానీ మిగతా ఇద్దరు కొడుకులు కలిసి రాజమ్మను ఒప్పించారు. ఆ పల్లెటూళ్ళోని పెద్దమనుషులు కూడా 'ఇంజనీరు' అంటే ఏమిటో వివరింగా చెప్పి, చదువుకునే సత్తా గలిగినోన్ని సదివించకపోతే పాపం తగుల్తుందని భయం కూడా పెట్టారు. రాజమ్మ అందరి మాటలకు తల ఊపి ''ఎలా సదివించాలి మరి?'' అంది.

''అవున్నిజమే! ఈ వూళ్ళో అమ్మితే కూడా పొలాలు కొనే వాళ్ళులేరు... ఎవడి దగ్గరైనా తాకట్టు పెడదాం'' అన్నాడు పెద్ద కొడుకు.

''ఉన్న పొలమూ తాకట్టుపెడితే... మన మెట్లా బతికేది?'' అంది రాజమ్మ.

''కష్టపడడానికి మాకు రెక్కలున్నాయి మ్మా'' అన్నారు ఇద్దరు కొడుకులు. రాజమ్మ భర్త కూడా ఎంత కష్టపడైనా సరే పై చదువులు చదివించాల్సిందేనని ముందుకు వచ్చాడు.

మొదటి విడత మూడెకరాలు తాకట్టు పెట్టారు. రెండవ విడత మూడెకరాలు తాకట్టుపెట్టారు. మూడో విడతకు పొలం మిగలకా, వున్న ఎడ్లనూ, బండినీ అమ్మేసారు. బి.ఇ చివరి సంవత్సరం చదవడానికి ఇక తాకట్టు పెట్టడానికి ఏమీ మిగల్లేదు. తాకట్టులోవున్న భూమిని పూర్తిగా అమ్మడానికి చూసారు. కానీ, కొనడానికి ఆర్థికంగా బాగా వున్న వారెవరూ లేనందున భూమి తాకట్టులోనే వుండిపోయింది. ఇక గత్యంతరం లేక రాజమ్మ ఒక లేబర్ కంట్రాక్టరు దగ్గర ఆరువేల రూపాయలు తీసుకుని డబ్బును పెద్ద కొడుక్కి పంపించి మిగతా ఇద్దరు కొడుకులను లేబర్ పనిచేయడానికి కంట్రాక్టరు వెంట జూరాల ప్రాజెక్టుకు పంపించింది. రెండు నెలలు గడిచాయో లేదో ఇసుకలారీ బోల్తాపడినందువల్ల రాజమ్మ కొడుకులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. లేబర్ కంట్రాక్టరు ఆరెండు ప్రాణాలకు ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించలేదు కానీ పదిమాసాల గడువు కాలానికి రాజమ్మ చేత, రాజమ్మ భర్త చేత లేబర్ పనిచేయించుకున్నాడు.

రాజమ్మ తన భర్తతో జూరాల ప్రాజెక్టు నుంచి తిరిగి తన పల్లెకు చేరుకొంది. అప్పటికే సంవత్సరం గడిచింది కాబట్టి, తన కొడుకు చదువు ఎలాగో పూర్తయ్యింటుందని తిరిగివచ్చి తన కొడుకును చూడాలని కళ్ళలో వత్తులు పెట్టుకుని ఎదురుచూసింది

రోజులు వారాలు, వారాలు మాసాలైపోయాయి. కానీ రాజమ్మ కొడుకు తిరిగిరాలేదు. ఒకేసారి ఉద్యోగం దొరికాక వస్తాడేమోనని మరికొంతకాలంపాటు ఎదురుచూసింది

''ఇదిగో రాజమ్మా! పొలం తాకట్టుపెట్టి తీసుకున్న అసలు రూపాయలకు వడ్డీ కలిపితే — భూమి ధరను మించిపోయింది. భూమిని

మా పేర రిజిస్టరు చేపిస్తావో, వడ్డీతో సహా కలిపి అప్పు తీరుస్తావో చెప్పు''అని అన్నాడు భూమిని తాకట్టు పెట్టుకున్న వ్యక్తి. మరికొన్ని రోజులు గడిస్తే వడ్డీ పెరిగిపోతుందన్న ఆలోచనతో పొలాన్ని అతడి పేర రిజి(స్ట్రేషన్ చేయించింది రాజమ్మ.

ఊళ్ళో అందరూ రాజమ్మను నీ కొడుకింకెప్పుడొస్తాడు? అని అడగడం మొదలుపెట్టారు. ''రేపో మాపో ఒస్తాడు... సర్కారు నవుకరి దొరికి లేకుంటది ఇంకా'' అని చెప్పింది రాజమ్మ.

''ఏం కొడుకమ్మా నీ కొడుక్కు? అతీగతీ చెప్పకుండా అక్కడేవుంటే ఎట్లా? కనీసం ఏ సంగతీ ఉత్తరం ద్వారానైనా రాయొచ్చుకదా'' అని కొందరు ఈసడించుకున్నారు. కానీ రాజమ్మ అలా ఈసడిస్తే సహించలేకపోయేది. ఏదో ఓ దురుసు సమాధానం చెప్పేది.

రాజమ్మ కొడుకు తిరిగిరాకపోతాడా, అతడితో ఏదైనా పని పడకపోతుందా అన్న ఆలోచనతో ఆ పల్లెలోని ఓ సన్నకారు రైతు రాజమ్మ, తన భర్త ఉండేందుకు ఓ చిన్న తాటాకుల గుడిసెను వేసేందుకు సహాయపడ్డాడు.

రాజమ్మ ఆ గుడిసెలోనే వుంటూ జీవనాధారం కొరకు వ్యవసాయ కూలీగా పనిచేస్తుండిపోయింది. రాజమ్మ భర్త కూడా వ్యవసాయ కూలీగానే మిగిలిపోయాడు. పంటల కాలం అయిపోయాకా, వ్యవసాయ కూలీ పనులు దొరకనందున ఆ పల్లెకు మూడుకిలోమీటర్ల దూరంలో నేషనల్ హైవే రోడ్డును కొత్తగా వేస్తుండడంవల్ల కంకరరాళ్ళను మోయడానికి కూలీకి వెళ్లకతప్పలేదు రాజమ్మకూ, తన భర్తకూనూ.

ఒకరోజు మండువేసవిలో— లేబరంతా హుషారుగా పనిచేస్తున్నారు. పనిచేస్తున్నారనే కంటే కం(ట్రాక్టరూ సూపర్‌వైజర్, టెంపరరీ మే(స్త్రీ కలిసి చేయిస్తున్నారంటే సబబు




## పిస్టల్ సరదా

అది న్యూయార్క్‌లోని ఓ నర్సరీ స్కూలు! మూడు నెలల (కితం మూడు సంవత్సరాల 'హాంగ్' అనే పసికందు స్కూలుకు ఓ పిస్టల్‌తో వచ్చాడట! ఎంతో గొప్పగా దాన్ని తన స్నేహితులకు చూపిస్తున్న సమయంలో టీచర్ దాన్ని చూసి భయపడి పోలీసుల్ని పిల్చిందట! పోలీసులు ముందు దాన్ని ఆడుకొనే బొమ్మ అనుకున్నా... పరీక్షించగా అది ఆటోమేటిక్ పిస్టల్‌గా తేలింది! వెంటనే కు(రాడ్ని అరెస్టు చేసి ఇంకా విచారణ జరుపుతూనే వున్నారట! పాపం సరదాగా తెచ్చిన పిస్టల్ పోలీసు కేసు దాకా వెళ్ళింది కదా! ఇంకా నయం... సరదాగా ఆ కు(రాడు ఎవర్నయినా పేల్చుద్దామనుకోలేదు!

—జూపిటర్

గా వుంటుంది. ఆరోజు సైటుమీదికి ఇంజనీరుగారు వస్తారని తెలిసింది వారికి. ఆ ఇంజనీరుగారు తాము ఎంత శ్రద్ధతో పనిచేయిస్తున్నారో చూసి మెప్పుపొందాలనే ఉత్సాహం ఆ సిబ్బందిలో వుంది. అందుకే ఆ పూట పని చకచకా సాగిపోతోంది. సాయంకాలం పనిమానుకున్న తరువాత తలా ఓ సీసా కల్లుకు డబ్బులిస్తానని కంట్రాక్టరు ఆశపెట్టడంతో లేబరు కూడా నిలకడ లేకుండగా, ఎండను లెక్కచేయకుం డగా పనిచేస్తున్నారు.

అనుకున్న సమయానికి అక్కడికి ఒక జీపు వచ్చి ఆగింది. జీపులోంచి ఇంజనీరుగా రు కిందకు దిగగానే కంట్రాక్టరు, సూపర్ వైజర్ పోటీపడుతూ ఇంజనీరుకు గొడుగుప ట్టారు. ఇంజనీరుగారి తెల్లని బట్టలు మండు టెండకు తళతళ మెరుస్తున్నాయి. గొడుగు నీడ ఉన్నప్పటికీ, ఇంజనీరుగారి మొహం నిమ్మపండు రంగులో ధగధగమెరిసిపోతుంది

తన కొడుకు కూడా ఇంజనీరు అవుతే ఎలా వుంటాడో చూడాలని ఉదయం నుంచీ తహతహలాడుతోంది రాజమ్మ. ఒక ఇంజనీ రు గారివాళ సైటుమీదకు వస్తారని తెలిసింది కాబట్టి కంకరరాళ్ళ తట్టను మోస్తున్న రాజమ్మ ఇంజనీరును చూసి అవాక్కయిపో యింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయిం ది. భ్రమపడుతున్నానేమోనని కళ్ళు నలుపు కునీ మరీ చూసింది. ఇంజనీరుగారు మీసాల ను ఎంతగా పెంచినా, సుఖంవల్ల ఒళ్ళు ఎంతగా బలిసివున్నా ఇంజనీరు గారి కుడిచేతి చిటికెన వేలిమీద ఉన్న పుట్టుమచ్చను చూసీ రాజమ్మ వాడు తన కొడుకేనని నిర్ధారణ చేసుకుని పలకరించబోయింది. కానీ ఆ ఇంజనీరుగారు, రాజమ్మవంక అసహ్యంగా చూసీ ముక్కువిడిచి, రాజమ్మనుగుర్తుపట్టన ట్టే అటూ ఇటూ దొంగచూపులు చూసీ సైట్ ఇన్స్పెక్షన్ కంప్లీటెడ్ అన్నట్టు వెంటనే జీపులో కూర్చుని వెళ్ళిపోయాడు.

రాజమ్మ సంతోషానికి హద్దుల్లేకుండా పోయాయి. తనను పలకరించకపోయినా తన కొడుకు ఉన్నతిని చూసీ గర్వపడింది. తన తల్లి కూలీ పనిచేస్తుందని నలుగురికి తెలిస్తే, తనకే అవమానమనుకుని పలకరించలేదను కుంది. తన కొడుకు గౌరవాన్ని తాను కూడా కాపాడాలనుకుని ఆ విషయం ఎవ్వరి తోనూ చెప్పలేదు రాజమ్మ. చివరికి అక్కడే కంకరరాళ్ళను పగులగొడుతున్న తన భర్తకు కూడా చెప్పలేదు.

''ఇప్పుడొచ్చిపోయిన పెద్దదొర పేరేంది సావీ?'' అని మామూలుగా అడిగింది రాజమ్మ— సూపర్‌వైజర్‌ని.

''బాలరాజు'' నీకెందుకే అవన్నీ అన్న ట్టు చెప్పాడు సూపర్‌వైజర్. వాడికి ముద్దు గా బాలయ్య అని వాని తాత పేరుపెట్టే, ప్రేమతో బాలీ అనిపిలుస్తుంటే నా కొడు క్కు ఆ పేరు మోటయ్యిందేమో! 'బాలరా జు' అని పేరు మార్చుకున్నాడు అని అనుకుంది రాజమ్మ.

రాజమ్మకు ఎండలో పనిచేస్తున్నట్టు అని పించలేదు. చల్లని వెన్నెట్లో నిండుయవ్వనం లో వుండి పనిచేస్తున్నట్టుగా అనిపించింది. పనిలో హుషారు పెరిగింది. ధ్యాసంతా తన కొడుకుమీదే! కొడుకు ఇన్నాళ్ళూ తనని మరిచిపోయాడా! ఉద్యోగం దొరికాకే ఊరికి

రావాలనుకున్నాడా! ఉద్యోగం కూడా కొత్తగా దొరికిందేమో! ఉద్యోగం దొరికి నెలకూడా దాటలేదేమో! ఒకేసారి జీతం డబ్బులు తీసుకునే రావాలనుకున్నాడేమో! ఇలా ఆలో చించినప్పటికీ— తన కొడుకును ఇంకోసారి కువుతీరా చూసి మనసారా మాట్లాడాలనే కోరిక కలిగింది రాజమ్మలో. అక్కడే పనిచే స్తున్న రోడ్డు రోలర్ డ్రైవర్‌ను తన కొడుకు వివరాలు అడిగి తెలుసుకుంది. (తన కొడుక ని చెప్పలేదు) ఆఫీసు ఏ ఊళ్ళో ఎక్కడ వున్నది, అయనగారి నివాసగృహం ఎక్కడ వున్నదీ తెలుసుకుంది. అంతకుముందు నిజా మాబాద్‌లో కొంతకాలం పనిచేసి, ఈ మధ్యే ఇక్కడకు బదిలీ చేయించుకుని వచ్చాడని తెలుసుకుంది.

తన కొడుకు వివరాలు తెలుసుకున్నా రాజమ్మ మనసు కీడును శంకించింది. ఎదలో ముళ్ళకంప గుచ్చుకున్నట్టుగా అనిపిం చింది. ఏ విషయమూ ముఖాముఖిగానే అడిగి తెలుసుకోవాలనిపించింది. వారం రో జుల తర్వాతా 'బట్వాడా' చేతిలోపడ్డాకా, విషయం భర్తతో చెప్పి బయలుదేరింది రాజమ్మ.

రాజమ్మ పల్లెటూరి మనిషే అయినప్ప టికీ, జిల్లా కేంద్రంలో తన కొడుకు పనిచేసే ఆఫీసును సునాయాసంగా కను క్కోగలిగింది. కానీ ఆఫీసు కాంపౌండు దాటడానికి ఆమె కాస్తా వెనకాముందు ఆడింది. రెండంతస్థుల కొత్త భవనం. కాపౌండులో రకరకాల పూల చెట్లున్నాయి. ఆ కాంపౌండులోకి అడుగుపెడుతున్న వాళ్ళం తా మల్లె పువ్వుల్లా తళతళ మెరిసిపోతున్నా రు. గ్యాంగు పనిచేసే ఆడవాళ్ళుకూడా యూనిఫాంతో నీట్‌గా అగుపించారు. గ్యాం గు పనిచేసే ఆడమనిషే రాజమ్మను అసహ్యం గా చూస్తూ "గేటు కాడ నక్కి నక్కి సూసుకుంటు నిలబడ్డావు... పూలు దొంగ తనం సేద్దామనా! నడూ దొంగలంజముం డా' అని కసురుకుని, కొట్టడానికన్నట్టు కట్టెకోసమో, రాయికోసమో వెదుకుతున్న



ట్టు అటూ ఇటూ చూసింది.

రాజమ్మ పెదవి కదిపి ఏమీ మాట్లాడలేదు. ఏ మాత్రం మాటకు మాట పెరిగి గొడవపడ్డా, తన కొడుకు మరింత చీదరించుకునే ఆస్కారముందని గ్రహించి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయం నుంచి ఆయన నివాసమందిరానికే బయలుదేరింది. ఇంటిదగ్గరున్నాడో ఆఫీసులో వున్నాడో, సైట్‌మీదికి దారా వెళ్ళాడో? ఇంతకూ ఈరోజు కలుస్తాడో లేడో! ఇంటిదగ్గర వున్నా మాత్రం కనికరించి మాట్లాడ్తాడోలేదోనన్న నిరాశతోనే మధ్యాహ్నం ఒంటిగంటకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారి నివాసగృహానికి చేరుకుంది. ఆ నివాసగృహం ఇంజనీరుగారి కార్యాలయం కన్నా ఎంతో బాగుంది. రెండంతస్తులు లేకపోయినా ఆ ఊళ్ళో కెల్లా విలువైన బంగళా అది. ఆ ఇంటిముందు రెండెకరాలకుపైగా వుంది మైదానం. ఆ మైదానం అంతా పచ్చగడ్డితో కళకళలాడుతుంది. ఆ మైదానంలోనే రెండు పెద్ద వేపచెట్లున్నాయి. ఆ మైదానాన్ని ఎవరైనా కొంత కబళిస్తారేమోనన్న ముందు చూపుతో రోడ్డు పొడవునా కాంపౌండు వాల్‌ను నిర్మించారు.

రాజమ్మ, కాంపౌండు గోడ నీడన కూర్చుని సేదదీర్చుకుంటూ ఆ ఇంటిని గమనించింది. 'అమ్మో! ఎంత పెద్ద ఇల్లు? కిరాయి ఎంతనో?' అని అనుకుంది. ఎంతైతే తనకెందుకు? వచ్చిన పనేదోచేసుకుని వెళదామన్నట్టు లేచి నిలబడింది. ముందుకు నడవడానికి కాళ్ళాడలేదు. ఇంతకూ ఇంట్లో కొడుకున్నాడోలేడో! ఇంకెవరైనా 'ఎవరు?' అని ప్రశ్నిస్తే ఏమని సమాధానం చెప్పాలి! సరైన సమాధానం చెబితే నమ్మరేమో! నమ్మినా ఇలాంటి తల్లి ఉందని తెలిస్తే కొడుక్కు అవమానమేమో! కొడుకు మాత్రం ఇంట్లో వుంటే పల్లెత్తి పలకరిస్తాడా! కళ్ళెత్తి కరుణతో చూస్తాడా! ఏమో అనుకుని మళ్ళీ అలాగే గోడనీడన కూర్చుంది రాజమ్మ.

రాజమ్మ చూస్తుండగానే ఆ ఇంట్లోంచి ఓ మధ్య వయస్సున్న ఆడమనిషి బయటికి వచ్చింది. తనకంటే ఎంతో హుందాగా అగుపిస్తున్న ఆ ఆడమనిషిని గుచ్చి గుచ్చి చూసింది రాజమ్మ. నేరుగా తనవైపే నడిచివస్తుండడంవల్ల ఇంత క్రితం ఆఫీసు దగ్గర గ్యాంగులేడి మాట్లాడినట్టే మాట్లాడుతుందేమోనని భయపడింది. ఎందుకైనా మంచిది... ఇక్కడినుంచి లేచివెళ్ళి దూరంగా కూర్చుంటే బాగుంటుందనుకుని లేవబోయింది. "ఓ పెద్దమ్మా! నీకాడ జర పోకదబ్బ వుంటే ఇస్తావా?" అంటూ ఆ ఆడమనిషి సమీపిస్తుంటే రాజమ్మ స్థిరంగా కూర్చుని పవిట కొంగున ముడికట్టి వున్న ముడిని విప్పి వక్క పేడును చేతిలోకి తీసుకుంది.

"అదేం పెద్దమ్మా! పోకదబ్బలను కొంగున ముడేసుకున్నావు. ఆకు సంచిలేదా! ఆకు అలవాటు లేదా?" అని పలకరించి రాజమ్మకెదురుగా నీడలో కూర్చుందామె. ఆమె మొహంలో అలిసిపోయిన లక్షణాలున్నాయి. విశ్రాంతి తీసుకునేందుకు వచ్చి కూర్చున్నట్టు గమనించింది రాజమ్మ. ఆ ఆడమనిషి బొడ్డుదగ్గర మడచివున్న ఆకుసం

చిని బయటకు తీసి, అందులో వున్న ఓ తమలపాకును తీసి దానికి సున్నం రాసి రాజమ్మ చేతిలోని ఒక్కపేడును తీసుకుంది

“ఈ ఇల్లు నీదేనా తల్లీ!” అమాయకంగా అడిగింది రాజమ్మ. అంతకంటే అమాయకంగా ఆమె రాజమ్మను చూసి “యా వూరు పెద్దీ మనది? అంది. రాజమ్మ తనకు తోచిన పల్లెటూరు పేరు చెప్పింది. “అట్లా సెప్పు మరి! ఈ ఇల్లు గుత్తెదారు భాస్కరరావుది” అంది.

“బాలాజు దొరదిగాదా? ఆశ్చర్యంగా అడిగింది.”

“బాలాజు దొర ఎవరుకున్నావ్! భాస్కరరావు దొర అల్లుడే!”

“అల్లుడా!”

“సొంతం అల్లుడు... ఒక్కతే బిడ్డ... కోట్లు ఆస్తి వుంది...”

“బాలాజు దొరకు పెండ్లయ్యిందా?”

“నిరుడే అయ్యింది. బాలాజు దొర నీకు తెలుసునా ఏంది? ఆ దొరపేరు నీకెట్లా తెలుసు?”

“ఇంతకుముందు ఆ బాటన నడిసేటోళ్ళు సెప్పుకుంటు పోతుంటే ఇన్న” అబద్ధమాడింది రాజమ్మ.

ఇద్దరి మధ్యా ఓ నిముషం మౌనంగా గడిచింది.

“ఇంతకూ నీవెవరు తల్లీ?” అడిగింది రాజమ్మ.

“బాలాజు దొరింట్లో పనిమనిషిని” ఆకు నములుతూ అందామె. రాజమ్మ ఆశ్చర్యపోయింది. తన పల్లెలోని గొప్పింటావిడ కూడా ఇంత హుందాగా ఉండడం చూడలేదు మరి.

“జీతం ఎంతిస్తరు?” రాజమ్మ అడిగింది. ఆమె తీసుకుంటున్న జీతం తెలియగానే రాజమ్మ ‘అబ్బో’ అని ఎదమీద చేయివేసుకుంది.

“బాలాజు దొర ఇంట్లోనే వున్నాడా! యాడికైనా పోయిండా!” మామూలు ధోరణిలో అడిగింది రాజమ్మ.

“ఆఫీసుకు బోయిండు... అమ్మగారు కూడా పట్నం పోయింది” పట్నంలో ఎవరుంటరు!



## బంగారం

“మీ వారు పట్టిందల్లా బంగారమే అంటుంటారుకదా, అదెలా సాధ్యం పిన్నిగారూ?” ఆశ్చర్యం వ్యక్తం చేసింది ఆండాళ్ళు.

“వెరీ సింపుల్! మావారు కస్టమ్స్ ఆఫీసర్ కదా, ఆయన బంగారంతప్ప ఇంకేమీ ముట్టుకోరు” నవ్వుతూ చెప్పింది పిన్నిగారు.

—సి.హెచ్.సురేష్ (సంగారెడ్డి)

"వాళ్ళ సిన్నమ్మ వుంది... ఆ తల్లి ఆడనే వుంటేనే బాగుండు"

"ఎందుకు?"

"ఓర్వజాలని ముండ! నేను ఆ తల్లికి పనిసేయనికె పనికిరానంట... ఇంతో అంత సదుకున్న మనిషి కావాల్నంట దానికి. తల్లి అంటేనే గిట్టదు... దొర కోసం ఎవరన్న ఇంటికొస్తే తల్లిని బేటికి రానీయకుండా ఇంట్లో పెట్టి తాళం ఏస్తది!"

"ఎందుకు?"

"ఆమె తల్లి పాతకాలం మనిషి! మోటుగా వుంటుంది. ఎవరైనా సూస్తే నామోషి అనుకుంటది" అంటూ తమలపాకు రసాన్ని కిసుక్కున ఉమ్మివేసింది.

ఆ పనిమనిషి తన కోడలిని 'ఓర్వజాలని ముండ' అని అన్నందుకు రాజమ్మ చాలా బాధపడింది. మరోవంక కన్నతల్లినే అసహ్యంగా చూసే తన కోడలు తనను ఎలా చూస్తుందో ఊహించడానికే భయపడింది రాజమ్మ. తన దురదృష్టానికి నిరుత్సాహంతో నిట్టూర్పు విడిచిందామె. అందరిలాగే రామజ్మ కూత తన మనమళ్ళతో, మనవరాళ్ళతో కాలక్షేపం చెయ్యాలనీ కలలు కంది. కలలు కలలుగానే మిగిలిపోయాయని వెంటనే నిర్ధారణకొచ్చింది.

"బాలాజు దొరొచ్చే పొద్దయ్యింది ఇక ఒస్త పెద్దమ్మా" అంటూ పనిమనిషి లేచి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయాకా కాస్సేపటికీ తెప్పరిల్లుకుని పనిమనిషి వెళ్ళిపోయినట్టు గమనించింది రాజమ్మ.

ఇంకా మరికొన్ని వివరాలను అడిగి తెలుసుకోవాలనుకుంది రాజమ్మ. కానీ అడగడానికి పనిమనిషి దగ్గరలేదు. ఒకవేళ వివరాలు అడుగుతుంటే పనిమనిషికి సందేహం వచ్చినా రావచ్చు... అడగకపోవడమే మంచిదనుకుంది రాజమ్మ.

రాజమ్మ, తన కొడుకు ఉన్నత స్థితిని, తన హీన పరిస్థితిని బేరీజు వేసుకుని, ఒకవైపు సంతోషపడ్తూ మరోపక్క కుమిలిపోతుండగా ఆ కాంపౌండులోకి ఒక జీపువేగంగా దూసుకొచ్చింది. రాజమ్మ ఆ జీపును గుర్తించింది. రోడ్డు పనికి కూలి వెళ్ళినప్పుడు, అతడు వచ్చింది అదేరంగు జీపని గుర్తించింది. జీపును చూడగానే లేచి నిలబడింది రాజమ్మ. తన కొడుకు కనిపిస్తాడేమోనని గుచ్చిగుచ్చి మరీ జీపువంక చూసింది. జీపులో కూర్చున్న తన కొడుకు రాజమ్మవంక చూసి కూడా ఏమెరగనట్టే వుండడం గమనించింది రాజమ్మ.

"ఇంతకూ నా కొడుకేనా! నా బాలిగాని పోలికలున్న మరొకడా! అన్న అనుమానం వచ్చినప్పటికీ రాజమ్మ ఆ ఇంటిముందుకు నడిచింది. జీపు ఇంటిముందు ఆగాకా, డ్రైవర్ జీపులోంచి దిగి కాలినడకన బయటికి వెళ్ళబోతూ రాజమ్మ అల్లంత దూరంలో వుండగానే "ఏయ్! యాడికి!" అని కసురుకున్నాడు.

"దొరను కలవాలి" రాజమ్మ డ్రైవర్ కసిరింపును ఖాతరు చేయకూండా ఇంటివైపు వేగంగా నడిచింది. డ్రైవర్ కూడా. రాజమ్మను ఏమీ పట్టించుకోకుండగా తన దారిన తను వెళ్ళిపోయాడు.

బాలాజీ జీపులోంచి దిగాక తనవైపు నడిచివస్తున్న రాజమ్మను చూసి ఇంట్లోకి

వెళ్ళకుండగా, మళ్ళీ జీపులో కూర్చున్నాడు. రాజమ్మ జీపును సమీపించి పెద్దమనిషికి గౌరవమిస్తున్నట్టుగా రెండు చేతులెత్తి వినయంగా నమస్కరించింది. "ఎవరు నువ్వు?" అని ప్రశ్నిస్తాడేమోననుకుంది రాజమ్మ. నిజంగా అలా ప్రశ్నిస్తే— ఆమె గుండె బాధ వర్ణనాతీతమే.

"ఎందుకొచ్చావ్?" ఈసడించుకున్నాడు వాడు. ఆ ప్రశ్నవల్ల వాడు తన కొడకేనని ధృవపరచుకుంది రాజమ్మ. "సూసి పోదమని ఒచ్చిన" అంది మెల్లిగా. తన కొడుకను చూస్తుంటే రాజమ్మ కళ్ళు మిలమిలమెరిసాయి.

"చూసావా?" కర్కశంగా అన్నాడు వాడు.

"ఆ... ఆ..." తల వూపింది రాజమ్మ. తనంటే తన కొడుక్కు గిట్టడంలేదని వెంటనే అర్థం చేసుకుంది రాజమ్మ. వాడు జీపులోంచి దిగాడు... చూసావుగా ఇక వెళ్ళొచ్చు అన్నట్టు చూసీ ఇంట్లోకి వెళ్ళబోయాడు.

"మీ నాయన కూడా నిన్ను సూడాలని బెంగపెట్టుకున్నాడు... సూడడానికి వొస్తే పలకరిస్తవా కొడుకా!" భయపడుతూనే మెల్లగా అడిగింది రాజమ్మ.

"ఏం చూస్తాడు! నేనేమైనా దేవుడినా?"

"ఎవరికైనా తండ్రి దేవుడితో సమానమే! ఆ దేవుడే నిన్ను సూడాలనొస్తే..."

రాజమ్మ మాట పూర్తికాకముందే "వచ్చే అవసరమేమీలేదు" అన్నాడు. వాడు ఏమాత్రం లెక్కచేయకుండగా.

"నువ్వే ఊరికి ఒస్తావా?" అమాయకంగా అడిగింది రాజమ్మ.

"ఏముందా ఊళ్ళో? ఎవరిని చూడ్డానికి రావాలి?" ఎవ్వరూ లేరన్నట్టే మాట్లాడాడు వాడు.

"నీ దయ నాయనా! నువ్వు సల్లగుండాలనే కోరుకుంటున్నాను... నీవు కూడా మా మీద ఇంత దయతలిస్తే..."

"దయ అంటే...డబ్బు కావాలా!" చీత్కారం.



## మరణశిక్ష

ఈ రోజుల్లో కిడ్నాప్ చెయ్యటం చాలా తేలికయిపోయింది! అయితే ఇస్లామిక్ దేశాలలో ఇలాటి నేరాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తారు. పాకిస్తాన్‌లో మొన్నీమధ్యదాకా కిడ్నాప్ నేరానికి 14 సంవత్సరాల జైలుశిక్ష విధించేవారు! కొత్త ప్రధాని నవాజ్ షరీఫ్ మాత్రం ఈ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని నిశ్చయించుకున్నారు. ఇక నుంచి కిడ్నాప్ చేసిన నేరస్థులకు మరణశిక్షేనట! మాద్దాం మరి — ఇప్పుడైనా భయపడి కిడ్నాప్‌లకు దూరంగా వుంటారేమో?

—జూపిటర్

''మా ముసలి ప్రాణాలను ఆదుకోడానికి ఇంకెవరుండారు!''

''నీకింకా ఇద్దరు కొడుకులున్నారు కదా'

''అయ్యో! నీకు తెలువదేమో కదూ! నీ సదువు కోసం అప్పుచేసి, అప్పుతీర్చడానికి కంట్రాక్టరు వెంట పనికిపోయి, లారీ బోల్తాపడి ఇద్దరు కొడుకులు ఒకేసారి సచ్చిపోయింద్రు'' కంట తడిపెట్టింది రాజమ్మ. ఆ మాటలకు వాడు ఒక్క క్షణమైనా నివ్వెరపోతాడనుకుంది. ''అయ్యో పాపం!'' అన్న సానుభూతైనా చూపకపోతాడా అని ఆశపడింది.

''మరింకేం! మీకు డబ్బెందుకు అవసరం?''

''బతకడానికి''

''ఇన్నేళ్ళు ఎలా బతికారు!''

''ఇంత కొంప, పొలం వుండేది... అన్నీ పోయినవి... అప్పటి బలం కూడా ఇప్పుడు లేదు...''

''మీకు బుద్ధి లేదసలు? ఆస్తినంత ఎందుకు పాడు చేసుకున్నారు? మనిషన్నాక ముందు చూపుండాలి! ముసలితనంలో ఎవ్వరూ ఆదుకోరని ఇంతో అంతో ఆస్తి మిగలబెట్టుకోవాల్సింది... మీ ఖర్మను మీర నుభవించండి''

''అవున్లే నాయనా! మా కర్మల ఆ దేవుడేం రాసిపెడితే అదే జరుగతది... నీవు మాత్రం మనసు నొప్పించుకోకు...'' ఓదార్పుతో అంది రాజమ్మ. అంతకంటే ఎక్కువ వినలేనన్నట్టు అంతకంటే ఒక్కక్షణకాలాన్ని కూడా ఎక్కువ కేటాయించలేనట్టు, రాజమ్మను ఏ మాత్రం పట్టించుకోకుండగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు వాడు.

రాజమ్మ మనోవేదనను నేను వర్ణించలేను. తన కొడుకు' డబ్బు ఇవ్వడానికి నిరాకరించినందుకు ఆమె లేశ మాత్రం బాధపడలేదు. కనీసం మనసారా పలకరించక పోయినందుకే ఎక్కువ దఃఖపడింది. తన తమ్ముళ్ళు చనిపోయారిన చెప్పినప్పుడు కూడా ఏ మాత్రం చలించని తన కొడుకు రాతిగుండెను తలుచుకుని విలవిల్లాడిపోయింది.

వారం రోజులు గడిచాక

''రాజెమ్మవ్వా! నేను పోస్టుమెన్ కొలువు జేయబట్టి మూడేండ్లు నిండిపోయినవి కదా! ఒక్కనాడు కూడా రః ఊరికి మనిఆర్డరు రాలేదు. కానీ ఇయ్యాల నీ పేర్న మనిఆర్డరొచ్చింది''

''ఏమొచ్చింది?'' మని ఆర్డరనే పదాన్ని ఎన్నడూ వినని రాజమ్మ బెదురుతూ అడిగింది.

''మనిఆర్డరు... అంటే... రూపాయలు ... రూపాయలొచ్చినవి...''

''యాడినుంచి'' ఆశ్చర్యంగా అడిగింది.

''పాలమూరునుంచి... బాలరాజు పంపిండు...''

''నా కొడుక్కు పంపిండా?''

''ఏందీ నీ కొడుకు... ఇంజనీయరా!'' పోస్టుమెన్ ఆశ్చర్యపోయాడు.

''ఏమనుకుంటివి మల్ల! ఎంత పంపిండు''

''నూరు రూపాయలు పంపిండు''

మని ఆర్డరు అంటే తెలియని కొందరు గ్రామ ప్రజలు రాజమ్మ గుడిసెముందు గుమిగూడారు. పోస్టుమెన్ రాజమ్మ వేలిముద్రను వేయించడం, రశీదు చించి ఇవ్వడం, వందరూపాయలు లెక్కపెట్టి ఇవ్వడం గమనించారు.

"ఏ కష్టాలు గట్టెక్కినవ్ రాజమ్మ! అన్నారొకరు.

"నా కొడుకు ఇంజనీరయ్యిండంట" కొత్తగా అప్పుడే తెలిసినట్టు సంతోషాన్ని ప్రకటించింది రాజమ్మ. చదువువచ్చిన ఒకతను రాజమ్మ చేతిలోని ఎంవో రిసిప్టును అందుకుని, ఫ్రం అడ్రసు చదివి, తన కొడుకు ఏ ఊళ్ళో పనిచేస్తున్నదీ పెద్దగా చదివి వినిపించాడు.


ఆ వార్త క్షణాల్లో పల్లె మొత్తం పాకిపోయింది. అందరూ రాజమ్మను ప్రశ్నించడానికి వచ్చివెళ్ళారు. ఆ రెండురోజులూ రాజమ్మనీ, ఆమె భర్తనీ కూలికి వెళ్ళనీకుండగా కొందరు ఇంటికి పిలిపించుకుని విందుభోజనంతో అతిథి సత్కారం చేసారు. రాజమ్మ సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఎదురుగా వున్నప్పుడు అంత కఠినంగా ప్రవర్తించిన కొడుకు మనసు అంత తొందరగా ఎందుకు మారివుంటుందా అని ఎన్నో ఊహాగానాలు చేసి చివరకు 'ఎంతైనా నా కన్న కొడుకు మరి!' అని నిర్ధారించుకుంది.

మరో నాలుగురోజులు గడిచిన తరువాత

—

హైవే రోడ్డు నుంచి రాజమ్మ వుంటున్న పల్లెకు మెటల్ రోడ్డును ప్రభుత్వం మంజూరుచేసింది. ఆ రోడ్డు సర్వేగురించి బడ్జెట్ ఎస్టిమేషన్ గురించి బాలరాజు తన పల్లెకు జీపులో వచ్చాడు.

ముందుగా అందరు గుర్తించకపోయినా ఇద్దరుమాత్రం బాలరాజు తన ఊరివాడేనని గుర్తించి పలకరించడంతో ఆ విషయం ఊరందరికీ తెలిసిపోయింది. ఎంతో చనువుగా "జీతమెంత వస్తది?" అని ఒకరు



"పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు?" అని ఇంకొకరు, "మీ తల్లి తండ్రులను నీ దగ్గరకెప్పుడు తీసికెళ్తావని" మరొకరు, "అమ్ముకున్న భూములన్ని మళ్ళీ కొనకూడదా!" అని ఒకరు సమాధానం రాకుండావే వెంటవెంటనే ప్రశ్నల వర్షం కురిపించారు. బాలరాజు మాత్రం చివరిప్రశ్నకు "భూములు కొనుక్కొని ఏం చేయాలి? వ్యవసాయం చేయడానికి మా తల్లిదండ్రులకు ఏం చేతనౌతుంది? అదే డబ్బును బ్యాంకులో డిపాజిట్టు చేస్తే కష్టపడకుండానే పంటకంటే ఎక్కువ వడ్డీ వస్తుంది కదా" అని సమాధానం ఇచ్చాడు.

"ఇంతకూ రాజమ్మ ఏదుంది?" గుంపులో ఎవరో ఒకరన్నారు.

"కూలికి పోయింటది మొగునెంట" మరొకరు సమాధానమిచ్చారు.

"మీరింత పెద్ద ఉద్యోగం చేస్తుండీ కూడా తల్లిదండ్రులను కూలి పనిచేసే పరిస్థితులను కల్పిస్తే ఏం బాగుంటుంది సార్?" బాలరాజు వెంటవచ్చిన డ్రాఫ్ట్సుమెన్ సాహసించి అడిగాడు. అందుకు బాలరాజు చిన్నగా నవ్వి "మనదేశం ఎందుకు ముందుకు పోవడంలేదో తెలుసా? ఇదిగో ఇందుకే! ఏదో ఒక పని చేయగలిగే శక్తి వుండి కూడా ఒకరి మీద ఆధారపడి ఊరకే వుండడంవల్లనే! నా తల్లిదండ్రులను ఊరకే కూర్చోబెడతాననుకోండి... కార్మికశక్తి తక్కువై ఉత్పత్తి తక్కువైతే దేశప్రగతి కుంటుపడుతుంది! నా తల్లిదండ్రులకుపయోగించాల్సిన డబ్బును నేను బేంకులో జమ చేసుకున్నాననుకోండి... దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడుతుంది... దీన్నే దేశభక్తి అని కూడా అంటారు. అందుకే నేను చెప్పేదేమంటే, ఎవరు కూడా ఎవర్నీ ఊరకే వుంచకూడదు... మా తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తేనేం... తాము కాస్త తిని ఇతరులకు మరి కాస్త పెట్టగలరు. ఏమంటారు" అని అన్నాడు.

అందరూ... "నిజమే... నిజమే..." ఎంతైనా పెద్ద చదువులు చదివితే పెద్ద తెలివే వస్తుంది అని అనుకున్నారు.

"అందుకే... నా తల్లిదండ్రులకు ఏమైనా ఇబ్బంది వుందేమోనని ఆలోచించి మొన్నోసారి వందరూపాయలు మనిఆర్డరు చేసాను... వాళ్ళకు మళ్ళీ అవసరమైతేగానీ డబ్బు సహాయం చేయను... మొన్న మనిఆర్డరు చేసాకా— "డబ్బెందుకు పంపినవ్ కొడకా... ఇప్పుడేమీ డబ్బు అవసరంలేదు... ఉంచుకో" అని మా అమ్మ నాకు డబ్బు వాపసు ఇస్తున్నట్టు కలవచ్చింది..."

"నిజమే సార్! నిన్ననే మీ అమ్మగారు నాచేత మీ పేరున రెండువందల రూపాయలు మనిఆర్డరు ఫారం రాయించి, డబ్బు అవసరమైనప్పుడు అడుగుతానని ఉత్తరం కూడా రాయించింది" అన్నాడు ఒకతను (అది నిజమే)

బాలరాజుకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టనిపించింది. ఇంతవరకూ వాడు తల్లిదండ్రులను పూర్తిగా మరచిపోయాడు. అనుకోకుండా రాజమ్మ కంటపడ్డాడు... విషయం ఊళ్ళో అందరికీ చెప్పిందేమోనని, అందుకు సమాధానంగా పైన చెప్పిన విషయాన్ని ప్రజలకు పనికట్టుకుని చెప్పాడు


కానీ తన తల్లి రోషంతో ఒక వందకు రెండువందలు వాపసు చేసిందని తెలియగానే మొహంలో రంగుమారుతుంటే కనపడనీకుండగా జాగ్రత్త పడ్డాడు. ఎట్టకేలకు ప్రజల్లో చెడుభావమేమీ ఏర్పడలేదని గ్రహించి మామూలుగా ఉండిపోయాడు. చివరకు పని ముగించుకుని తిరిగి వెడుతూ "వీలైతే నేను మళ్ళీ వచ్చేవారమో అటువారమో వస్తానని మా అమ్మానాన్నకు చెప్పండి. వారిని ఈరోజు కలుసుకునే అదృష్టం నాకులేదు. గవర్నమెంటు పనిమీద డ్యూటీకి వచ్చి స్వంత విషయాల్లో జోక్యం కలగచేసుకోవడమంటే దేశద్రోహం క్రిందే లెక్క. నేను దేశానికి ద్రోహం చేయలేను" అని జీపులో కూర్చుని వెళ్ళిపోయాడు.

సాయంకాలం రాజమ్మ కూలీ పని ముగించుకుని వచ్చిన తర్వాత జరిగిన విషయం రాజమ్మకు పూసగుచ్చినట్టు చెప్పారు పల్లె ప్రజలు. వచ్చే వారమో, అటొచ్చే వారమో వీలు చూసుకుని వస్తానని చెప్పినట్టు కూడా చప్పారు.

రాజమ్మ సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఒక్కొక్కరు రాజమ్మను పొగిడి ఆకాశానికి ఎత్తివేసారు. తన కొడుకు గురించి ఎవరో ఒకరు పొగడని రోజంటూలేకుండా పోయింది.

ఆ తరువాత రాజమ్మ, కొడుకు రాకకోసం వారం రోజులవరకూ ఎదురుచూసింది. కొడుకు జాడ ఏమీ తెలియలేదు. ఆ తరువాత రెండోవారం వరకు ఎదురుచూసింది. మూడోవారం కూడా రాకపోయేసరికి కొడుకుకు క్షేమసమాచారాలు తెలుపుతూ ఉత్తరం రాసింది. ఆ ఉత్తరం జవాబు కొరకు మరో వారం ఎదురు చూసినా ఎలాంటి ఉత్తరం రాలేదు.

రాజమ్మ భర్తనే "బాలిగానిది పెద్ద ఉద్యోగం! రానిక్కి ఉత్తరం రాయడానికి తీరిక దొర్కలేదేమో! నాకు వాణ్ణి సూడాలనిపిస్తుంది. కొడుకు రెండుదినాలు రాత్రి పూట కలలోకొచ్చిండు" అని రాజమ్మతో అన్నాడు. భర్త కోరిక ప్రకారమే కాకుండా తనకు కూడా కొడుకును చూడాలనిపించడంతో కొంత అప్పుచేసి భర్తను కొడుకు దగ్గరకు తీసుకెళ్ళింది. ఆరోజు ఆదివారం.



## సందేహం

ఆయా ఉద్యోగం కోసం వచ్చిన అమ్మాయితో చెప్తోంది ఇంటావిడ—

"ఆయన అన్ని విషయాలూ జాగ్రత్తగా గమనిస్తూంటారు. నిజాయితీగా పనిచేస్తావో లేదో, ప్రేమగా చూసుకుంటావో లేదో, సెలవురోజుల్లో బయటకు షికారు తీసుకెళ్తావో లేదో, ఇంకా...."

"అది సరే! ఇంతకీ నేను చూసుకోవాల్సింది మీ బాబునా, లేక మీ ఆయన్నా?" అడిగిందా అమ్మాయి అనుమానంగా.

—పద్మలత (విశాఖపట్నం)

కావడంతో కొడుకు ఇంటిదగ్గరే ఉన్నాడు.

రాజమ్మ తన భర్తతో కాంపౌండు గేటులోకి కాలుపెట్టగానే కొడుకు ఏదో కొంపలంటుకుపోయినట్టు ఇంట్లోంచి రాజమ్మ కెదురుగా వచ్చాడు. తమను ఆహ్వానించడానికే అంత వడివడిగా నడుచుకుంటూ వస్తున్నాడనుకున్నాడు రాజమ్మ భర్త. కొడుకు వాళ్ళను సమీపించి "మళ్ళీ ఎందుకొచ్చారు? నేను సుఖంగా బ్రతకడం మీకిష్టం లేదా!" అని గద్దించినట్టు అడిగాడు. తమను ఎవరేనా ఇంట్లోంచి చూస్తున్నారేమోనని ఇంటివైపు తత్తరచూపులు చూసాడు.

"అదేంది కొడుకా అట్లా మాట్లాడ్తవ్! నీ సుకం, సంతోషం మేము కోరకుంటే ఇంకెవరు కోరుకుంటారు?" ఆప్యాయతతో అన్నాడు రాజమ్మ భర్త.

"మీరు కాకుంటే నా సుఖం కోరుకునే వాళ్ళు సవాలక్ష మందున్నారు. కానీ... మీరు ముందు ఇక్కడినుంచి వెళ్ళిపోండి... మీకు డబ్బులేమైనా కావాలంటే రేపో ఎల్లుండో మనిఆర్డరు చేస్తాను కానీ ఇకమీదట ఇక్కడెప్పుడూ రాకండి... ఇలాంటి తల్లిదండ్రులు నాకున్నారని తెలిస్తే నా పెండ్లాం నా ముఖం కూడా చూడదు... మిమ్మల్ని చూస్తే నన్ను పెళ్ళి చేసుకోదనే నాకు తల్లిదండ్రులు చనిపోయారని చెప్పాను. నేనబద్ధం చెప్పానని ఇప్పుడు తెలిస్తే నన్ను ఇంట్లోకి కూడా రానివ్వదు... వెళ్ళిపోండి... వెళ్ళిపోండి" అని వాడు ఎంతవేగంగా వచ్చాడో అంతకంటే వేగంగా ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఆ దంపతులు కూడా అక్కడ ఒక్కక్షణం ఆగకుండగా వెనుతిరిగి చూడకుండా పల్లెకు వెళ్ళిపోయారు. ఆ పల్లెలో పలకరించిన ప్రజలకు, తమను కొడుకు ఎంత గొప్పగానో ఆదరించాడనీ, కల్పించుకునీ అబద్ధమాడారు. తన కొడుకు తన దగ్గరే ఉండిపొమ్మని ఎంతగానో బ్రతిమాలుకున్నాడనీ, తమకే ఆ పల్లెను, ఆ ప్రజలను వదలిపెట్టి ఉండడం ఇష్టంలేదనో మరో అబద్ధాన్ని కూడా చెప్పింది రాజమ్మ.

రాజమ్మ తన కొడుకు డబ్బు పంపిస్తాడని ఎదురు చూడనైతే చూడలేదుగానీ ఆఫీసు పనిమీద ఎప్పుడైనా తమ ఊరికి వస్తే (కొత్త రోడ్డు వేసే విషయంలో) కళ్ళారా ఓసారి చూడాలని చాలారోజులవరకు ఎదురుచూసింది. కొత్తగా మెటల్ రోడ్డు వేయడం కూడా జరిగిపోయింది కానీ, తన కొడుకు ఆ పల్లెకు రాలేదు. కొడుకునుంచి ఎలాంటి సమాధానం రాకపోయినప్పటికీ నెలకోమారు చొప్పున రాజమ్మ కొడుక్కి ఉత్తరం రాయించేది.

ఆ తరువాత కూడా కొడుకును కళ్ళారా చూడాలన్న మమకారంతో రాజమ్మ కొడుకు దగ్గరకు వెళ్ళింది. కానీ ఎప్పుడూ టూర్‌లోనే ఉండడంవల్ల చూసే భాగ్యం కలగలేదు. ఆదివారం పూటైతే ఇంటిపట్టున ఉంటాడని తెలిసినప్పటికీ ఆమె ఆదివారం పూట బయలుదేరి వెళ్ళడానికి ఎప్పుడూ వీలుకలగ లేదు.

ఇప్పుడు వీలైంది. అత్యవసర పరిస్థితి కూడా ఏర్పడింది. కాబట్టి బయలుదేరక తప్పలేదు రాజమ్మకు. తన కొడుక్కు పరిస్థితిని వివరిస్తే కాస్తా మనసు కుదరకపోతుందా అన్న ధీమాతో కాస్త కాలికొద్దీ

వడివడిగా నడిచింది రాజమ్మ. కొడుకు కాంపౌండు గేటును సమీపించే సరికి రాజమ్మకు చెమటలు పోసాయి. ఆ చమటకు ఆమె ఒంటిమీదున్న దుస్తులన్నీ తడిసిపోయాయి.

రాజమ్మ మనసు మరింత దిగులుతో నిండిపోయింది. ఈసారి తన కొడుకు తనను చూసి కోపంతో కాలితో తంతాడేమోనని భయం వేసింది. అయినా సరే! తాడోపేడో తేలిపోతుంది...అని కాంపౌండు గేటు దగ్గరున్న చెట్టు నీడన కూర్చుని కాస్త సేదతీర్చుకుంది. ఒంటి మీద చమట ఆరిపోయాక ఇంటివైపు ఒంటికన్నుతో దీక్షగా చూసింది. ఇంట్లో మనుషులు తిరుగుతున్న జాడ అగుపడలేదు.

మొత్తానికి తాను బాలరాజు తల్లిగా ఆ ఇంట్లో ఎవ్వరికీ చెప్పుకోకుండగా ఏదో ఓ వంకతో బాలరాజును కలుసుకుని తానొచ్చిన పనిగురించి చెప్పాలనుకుని... మెల్లిగా లేచి ఆ ఇంటివైపు నడిచింది. ఆ బంగళాముందు వేలాడుతున్న దిష్టిబొమ్మ రాజమ్మకంటే ఎంతో ముద్దుగానూ, విలువైనదిగానూ ఉంది. రాజమ్మ ఆ దిష్టిబొమ్మకేసి వింతగా చూసింది.

"యాదమ్మా! ఎవరో బిచ్చగత్తెవచ్చింది చూడూ!" అన్నాడు బాలరాజు. రాజమ్మను చూసీ "బిచ్చగత్తెను కాద్దొరా!" పెద్దగా ఆకలిగొన్న భిక్షగత్తెలానే అరిచింది రాజమ్మ.

"మరెవరు!" రాజమ్మ కేకవిని రాజమ్మ కోడలు ఇంట్లోంచి వచ్చి అడిగింది.

"నా మొగుడు పానాపాయంలో వుండడు... అయిద్రాబాద్ దావాఖాన్ల ఆప్రేసను చేయించాలె! పెద్దదొరలు... ఏవన్నా సాయం సేయాలె" రాజమ్మ తన కొడుక్కు వినపడేట్టు అంది... ఈమేనా నా కోడలు! అన్నట్టు అరచేతిని నుదుటిన అడ్డా పెట్టుకుని చూసింది రాజమ్మ. బాలరాజు వరండాలోకి వచ్చి రాజమ్మను గుర్తుపట్టనట్టే "నీవే చావడానికి దగ్గరపడ్డావు! నీ మొగుడిని బతికించుకుని ఏంజేస్తావే! ఇద్దరుకలిసి కట్టగట్టుకు సావండి! బతికి మాత్రం మీరెవర్ని ఉద్ధరిస్తారు" అని భార్యవైపు చూసి ఎలా



# బాధ

"ఇంత వర్షం పడుతోంది! గొడుకు తీసుకళ్ళకుండా వెళ్ళింది మా శ్రీమతి. ఎలా వస్తుందోనని బాధగా వుందిరా!" చెప్పాడు రవి కిరణ్ తో.

"ఫర్వాలేదులేవోయ్! మరీ వర్షం ఎక్కువైతే ఎవరింట్లోనైనా కాసేపు వుండి వస్తుందిలే!" సమాధానపరిచాడు కిరణ్.

"అదేరా నా బాధంతా!" నెత్తి బాదుకున్నాడు రవి.

—పి.పండరి (హైదరాబాద్)

వున్నాయ్ మన డైలాగులు అన్నట్టు గర్వంగా బుజాలెగరేసాడు. బాలరాజు భార్య కూడా మీకంటే నేనేమీ తక్కువ కానన్నట్టు "వయసులో వున్నప్పుడు సరంపాదించిందంతా తాగితందనాలకు ఖర్చుపెట్టి ఇప్పుడడుక్కుంటే ఏం లాభం! ముసలితనం ముందుందని గుర్తుపెట్టుకుని నాలుగు డబ్బులు వెనకేసుకునే జ్ఞానం లేకపోయింది" అని రాజమ్మ వంక చీత్కారంగా చూసి తలుపులు ధభీమని మూసివేసింది. యాదమ్మ కూడా లోపలి గదిలోనుంచి లోపలి గదిలోకే వెళ్ళిపోయింది.

రాజమ్మ నిరుత్సాహంగా వెనుతిరిగి వచ్చేసింది. బస్టాండులో కూర్చుని బస్సు ఛార్జీలకు డబ్బులడుకోవాలనే ఆలోచన వచ్చిందామెకు. కానీ మనసొప్పక దిగాలుగా బస్టాండు గేటు నీడన ఏమీ తోచక కూర్చుండిపోయింది.

మనసున్న ప్రతిమనిషిని రాజమ్మ అవతారం కదిలించివేసింది. అందుకే రాజమ్మ నోరు తెరచి ఏమీ అడక్కపోయినా చేయిచాపి ధర్మం అని అడక్కపోయినా ఎవరికి చేతనైనంత చిల్లరను వారు రాజమ్మ ముందు విసిరారు.

రాజమ్మ తన కొడుకు గురించే ఆలోచిస్తుండిపోయింది. తన కొడుకు ఉన్నతుని గురించి పల్లె ప్రజలు గొప్పగా చెప్పుకుంటున్నారు. కన్న తండ్రి చావు బ్రతుకుల్లో వుంటే కూడా పది రూపాయలు సహాయం చేయలేదని తెలిస్తే... తన కొడుకునే చీదరించుకుంటారు. ఒకవేళ తండ్రి చనిపోతే కూడా శవాన్ని చూడ్డానికైనా వస్తాడన్న ఆశలేదు... అదే జరిగితే... ప్రతి తల్లీ, ప్రతి తండ్రీ ప్రాణమున్న ప్రతిమనిషీ తన కొడుకును దూషిస్తారు... వద్దు... వద్దు... అలా ధూషించే ఆస్కారం ప్రజలకు కలగనీయకూడదు... వాణ్ణి ధూషిస్తుంటే వినడానికేనా బ్రతికున్నదీ! ధూషణకు గురి కావడానికేనా వాణ్ణి గొప్ప చదువులు చదివించింది?

పిల్లలు, కన్నవారి కీడును కోరుకుంటారేమోకానీ కన్నవారు మాత్రం సదా పిల్లల క్షేమాన్నే కోరుకోవాలి... రాజమ్మ తన ముందున్న చిల్లర డబ్బులను లెక్కపెట్టుకుంది... దాదాపుగా పాతిక రూపాయలున్నాయి. అక్కడినుంచి లేచి తనెక్కాల్సిన బస్సు ఎక్కింది. మరుసటిరోజు

"నా కొడుకు తన తోటికే రామన్నాడు నా మొగుడిని వాడే దవఖాన్ల సేర్పించి ఆప్రేషన్ సేపిత్తడంట... ఎల్లి మల్లొస్తాం.'' అన్న చిన్న అబద్దాన్ని ప్రజలతో చెప్పి మరోవంద రూపాయలు నమ్మించి అప్పుతీసుకుని తన భర్తను పొరుగు రాష్ట్రం తీసుకెళ్ళిందిరాజమ్మ. అక్కడ భర్తతో విషయం చెప్పింది రాజమ్మ. రాజమ్మ నిర్ణయాన్ని ఎంతో అభినందించాడాయన. "వాడిని పెజలలోటి తిట్టించే కంటే మనమిలా దిక్కులేని చావు సావడమే మేలు అని కూడా మనస్ఫూర్తిగా అన్నాడు రాజమ్మ భర్త.